
# కథ



కాసుల ప్రతాపరెడ్డి

# శిథిలం

రాత్రి కురిసిన వానకు అంతా చిత్తడి చిత్తడిగా ఉంది. ఆ చిత్తడిలో నడుస్తుంటే మనసంతా చిరాకు. దానికితోడు గుండెను మెలిపెడుతున్న బాధ. ఈచిరాకును పారదోలే మందేదీ కనిపించదు. ఆశలు, ఆశయాలు సన్నగిల్లి బతకడం ఒక్కటే మిగిలింది. భూమిపై పాకడం ఒకటే. రాకేష్ కాళ్ళకింద బురద, మనసంతా బురద.

ఆకాశం చిల్లులు పడ్డట్టు రాత్రి వాన. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడి అల్పపీడనంగా మారి కోస్తాను తుఫాను తాకితే తప్ప ఇక్కడ వర్షాలు పడేట్టు లేవు. శరీరం తూట్లు పడి రక్తం ధారగా కారుతున్నట్లు అనిపించింది రాకేష్‌కు. పోలిక అలంకారాల ప్రకారం సరిపోదనిపించింది. ఎదురుపడిన ఊరకుక్క అనుమానంగా చూసి మొరగబోయి ఊరుకుంది. దానికి మొరిగే ఓపికున్నట్లు లేదు. బొక్కలు బయటకు తేలి కనిపిస్తున్నాయి.

కాలు తీసి కాలు పెడుతుంటే బట్టలపైకి చిమ్ముతున్న బురద నీళ్ళు.

అభివృద్ధి ఈ ఊరిదాకా పాకినట్లు లేదు. ఇప్పటివరకు ఎన్ని కిలోమీటర్ల అభివృద్ధి జరిగి ఉంటుంది? రోడ్ల రూపంలో అభివృద్ధి అనూహ్యంగా జరిగిపోతూనే ఉంది కదా! ఆకాశం నుంచి పడిన నీళ్ళు కూడా భూమిలోకి ఇంకకుండా అంతా రోడ్లే పరుచుకుంటాయి కాబోలు! ఖాళీ స్థలమేదీ లేకుండా రోడ్లు వేస్తే ఎలా ఉంటుంది? అంత బాధలోనూ నవ్వు వచ్చింది రాకేష్‌కు.

కొంత దూరం నడిచాడు. ధాన్యం వ్యాపారం చేసే కిరాణాకొట్టు వ్యాపారి ఇంట్లోంచి మైక్ పెట్టినట్లు "రాను రానంటూనే చిన్నదో చిన్నది, రాములోరి గుడికొచ్చిందో" అనే పాట వినిపించింది. గతంలో పాటలు రేడియోలో వచ్చేవి. ఇప్పుడు టీవీల్లో వస్తున్నాయి. కలర్ టీవీ ఇక్కడికి ప్రవేశించిందంటే అభివృద్ధి ఇక్కడికి పాకినట్లే!

కురమ లచ్చవ్వ ఎదురుపడి, పరికించిచూసి "బాగున్నావా బిడ్డా?" అని అడిగింది.

"ఏదో కాలం గడుస్తున్నది" అని జవాబిచ్చి ముందుకు నడవబోయాడు రాకేష్. లచ్చవ్వ నిలబడింది. ఆగక తప్పలేదతనికి. బాగా చితికిపోయినట్లు ఆమె రూపమే చెప్తోంది. ఇప్పుడు కుండలు చేయడం, వాటిని వాములో కాల్చడం, అమ్మడం లేదు. ఏం చేస్తుందో తెలియదు.

"ఏందో బిడ్డా? ఇదేం శాపమో గానీ నాలుగేండ్ల సంది వానలు లేవు. గొంతు తడుపుకుంటానికి సుత తండ్లాటే. రాత్రి ఇంత వాన పడింది" అంది లచ్చవ్వ.

"చెరువులకు నీళ్ళొస్తయా అవ్వా?" అని అడిగాడు.

ఆమె ఒక నవ్వు నవ్వింది. ఆ నవ్వు తనను వెక్కిరిస్తున్నట్లు అనిపించింది రాకేష్‌కు. ఎంత అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతున్నాడనే ధ్వని ఉంది ఆ నవ్వులో.

"భూమి దప్పి గొనున్నది. పడింది పడినట్లు ఆవిరి పోయింది. మిగిలింది భూమిల ఇంకిపోయింది. అయినా చెరువెక్కడిది బిడ్డ? దాని ఆనవాళ్ళు సుతలేవు" అంది.

తమ తాత ముత్తాతల కాలంలో ఈ ప్రాంతంలో ఎక్కడ పడితే అక్కడ చెరువులు నిర్మించారు. కాలువలు తవ్వించారు. ఈ చెరువుల్లో, కాలువల్లో ఏ ఒక్కటైనా మిగిలి ఉందా? పాకాల చెరువు ఇంకా ఉందా? అనే అనుమానం కలిగింది రాకేష్‌కు. "ఒక్కసారి చూసొస్తే బాగుండు" అనిపించింది. దాంట్లో సర్కార్ తుమ్మలు మొలిచి ఉంటాయా? తమ ఊరి చెరువుకు పట్టిన గతే చాలా చెరువులకు పట్టి ఉంటుంది. చెరువుల్లో నీళ్లుంటే భూమి పొరల్లో నీళ్ళుంటాయి. మొత్తంగా నీటి వ్యవస్థ అంతా కుప్ప కూలిందనేది రాకేష్‌కు అర్థమైంది.


"ఎక్కడికి బిడ్డా?" అని అడిగింది.

"రాంరెడ్డి మామ చనిపోయాడు కదా!" అన్నాడు. రాంరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడనే వార్త అందడంతో హైదరాబాద్ నుంచి ఉన్న ఫళాన వచ్చేశాడు. అప్పటినుంచి గుండె మెలిపెడుతూనే ఉంది. ఆ బాధను పూర్తిగా అనుభవించనీయని చిత్తడంటే కోపంగా ఉంది అతనికి.

రాంరెడ్డి మామ వ్యవసాయం బాగా చేస్తాడని పేరు. ఎక్కువగా బాయికింద వడ్లు పండించేవాడు. పుట్లకు పుట్లు పంట తీసేవాడు. రాంరెడ్డి తన ఈడువాడే. కానీ వరుసకు మామ అవుతాడు. చదువులో వెనకబడిన రాంరెడ్డి వ్యవసాయంలో ముందున్నాడు. ఆముదం, కంది వేసేవాడు. పాడి బర్రెలుండేవి. కొన్ని పాలను అమ్మేవాడు. అయినా ఇంటి నిండా పాడి ఉండేది.

చిన్న చిన్నగా బాయి ఎండిపోవడం మొదలు పెట్టింది. ఆ బాయి ఎండడం ఊళ్ళో ఇప్పటివరకు చూసినవారు లేరు. అటువంటి బాయే ఎండిపోయిందంటే మిగతా బావుల సంగతి చెప్పనవసరం లేదు. చాలా మంది వ్యవసాయం మానుకున్నారు. అయితే రాంరెడ్డి లాంటి కొంత మంది దాని అంతు చూసేదాకా వదలకూడదనుకున్నారు. ఇవ్వాళ కాకపోతే రేపు కాలం కాకపోతదా అనేది వారి ఆశ. రాంరెడ్డి

బాయిలో బోరు వేయించాడు. బాయిలో నీళ్ళుంటే కరెంట్ లేక పోవడం, కరెంట్ వుంటే నీళ్ళు లేకపోవడం గత నాలుగేళ్లగా ఒక ఆనవాయితీ అయింది. దానికి తోడు కరెంట్ చార్జీలు పెరిగాయి. పెరగడమే కాదు, బలవంతపు వసూళ్ళు మొదలయ్యాయి. రైతు దిక్కులేనివాడయ్యాడు. బాయి కోసమే కాదు, ఇళ్ళు గడవడానికీ అప్పులమీద అప్పులు చేయాల్సి వచ్చింది. ఊళ్ళో రైతుకు అప్పంటే ఎంత. ఈ రోజుల్లో లక్ష ఎక్కువ. అప్పుల వాళ్ళు వెంటపడడం మొదలుపెట్టారు. దుఃఖాన్ని దిగమింగుకుంటే నడుస్తున్న శవంలా ఎన్నాళ్ళు ఇలా సాగాలో అంతు బట్టకుండా ఉంది. కలుపుగోలుగా ఉండే రాంరెడ్డి పలకరిస్తే తప్ప మాట్లాడేవాడు కాదు. అది కూడా పొడిపొడిగా వేసిన ప్రశ్నలకు జవాబిచ్చేవాడు.




ఆ మధ్యన తాను ఊరికి వచ్చినప్పుడు కదిలిస్తే పొడి పొడిగా మాట్లాడాడు. లోపలేదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు అనిపించింది.

"ఏందిరా మామా! అట్లున్నావు? ఒంట్లో బాగా లేదా?" అని అడిగాడు రాకేష్.

"కరెంట్ బిల్లులు కట్టకపోతే అరెస్టు చేసి జైల్లో పెడతారట కదరా?" అని అడిగాడు.

పరిస్థితి దారుణంగా వుంటుందిరా మామా! మనకు ఇప్పుడు మొదలైంది. ఒరిస్సాలో ఎప్పుడో మొదలైంది. కరెంట్ బిల్లుల వసూలుకు వెళ్ళిన కరెంట్ ఉద్యోగుల మీద రైతులు దాడి చేసిన సంఘటనలు అక్కడ జరిగాయి. ఇందులో ఒకతను చనిపోయాడు కూడా' చెప్పాడు రాకేష్. విద్యుత్ ఇంజనీర్ల సంఘం ఒరిస్సాలో అమలు జరిగిన విద్యుత్ సంస్కరణలపై స్టడీ చేసి వచ్చి ఒక రిపోర్టు తయారు చేసింది. ఆ రిపోర్టు కాపీ ఒకటి రాకేష్ వద్దకు వచ్చింది. దాని ఆధారంగా ఒక వార్త రాశాడు.

రాంరెడ్డి ముఖం కందిపోవడం రాకేష్ అప్పుడు గమనించలేదు.

"నీకేందిరా పంటలు బాగానే పండుతాయి కదా!" అన్నాడు రాకేష్.

"ఎక్కడిది మామా! అప్పుల మీద అప్పులు అవుతున్నయి. ఏం చేయాలో దిక్కు తోచడం లేదు. కరెంట్ సరిగా వస్తలేదు. వేసిన పంటలు ఎండిపోతున్నాయి" అన్నాడు బాధగా.

రాకేష్ రాంరెడ్డి ఇంటివద్దకు చేరుకునేసరికి అక్కడి దృశ్యం హృదయవిదారకంగా ఉంది. బురద వాకిట్లో పాడెపై రాంరెడ్డి శవం తనను నిలబెట్టి ప్రశ్నిస్తున్నట్లే ఉంది. "ఏంరా! నువ్వు ఊరినుంచి పారిపోతే నేను జీవితం నుంచి పారిపోయాను. ఇద్దరమూ పారిపోయినవాళ్ళమే" అని అన్నట్లనిపించింది.

**తమ తాత ముత్తాతల కాలంలో ఈ ప్రాంతంలో ఎక్కడ పడితే అక్కడ చెరువులు నిర్మించారు. కాలువలు తవ్వించారు. ఈ చెరువుల్లో, కాలువల్లో ఏ ఒక్కటైనా మిగిలి ఉందా? పాకాల చెరువు ఇంకా ఉందా? అనే అనుమానం కలిగింది రాకేష్‌కు. "ఒక్కసారి చూసొస్తే బాగుండు" అనిపించింది. దాంట్లో సర్కార్ తుమ్మలు మొలిచి ఉంటాయా? తమ ఊరి చెరువుకు పట్టిన గతే చాలా చెరువులకు పట్టి ఉంటుంది. చెరువుల్లో నీళ్లుంటే భూమిపొరల్లో నీళ్ళుంటాయి.**

"తెల్లారి లేస్తే పరుగులు. ఏం బతుకులురా మీవి" అనేవాడు. రాకేష్ నవ్వి ఊరుకునేవాడు. రాంరెడ్డిలో ఒక విధమైన సంతృప్తి కనిపించింది. మనిషికి కావాల్సింది ఈ సంతృప్తిని మించి ఏముంటుంది? అంత సంతృప్తితో జీవించే రాంరెడ్డి జీవితంలో మంటలు పుట్టాయి. భయాలు ముంచెత్తాయి. రాంరెడ్డి తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు భోరు భోరున ఏడుస్తున్నారు.

రాకేష్ భారంగా రాంరెడ్డి తల్లి వద్దకు చేరుకున్నాడు. ఆమె రాకేష్‌ను పట్టుకొని గుక్కపట్టి ఏడ్వడం మొదలుపెట్టింది. ఆమెను ఓదార్చడమెట్లాగో అతనికి తెలియలేదు. పట్నం బతుకు "ఏడ్చేవారికి ఓదార్పునిచ్చే పద్ధతిని దూరం చేసిందేమో" అని అంత బాధలోనూ అనిపించింది అతనికి.

తలపై నిమురుతూ "అమ్మమ్మా! ఏడ్వకే!!" అని మాత్రం అనగలిగాడు.

"నువ్వు చదువుకొని బయటపడితివి బిడ్డా! వాడేమో ఇట్లాయె!!" అంటూ ఏడ్వసాగింది. "చెట్టంత కొడుకు పోయిండు. ఇగ నేనుండెందుకు అని ముఖంపై రెండు చేతులతో కొట్టుకోసాగింది. ఆమె చేతులు పట్టుకొని ఆపాడు రాకేష్. ఆమెను కూర్చోబెట్టి పక్కకు వచ్చాడు. పిల్లలను దగ్గరకు తీసుకున్నాడు. తండ్రి లేని ఆ పిల్లలు రేపటి నుంచి ఎలా బతుకుతారని అనిపించింది. తండ్రి మరణం వాళ్ళని ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటుందేమో! వారికి ఈ వ్యవస్థ మీద ఆగ్రహం కలగక, అనురాగం కలుగుతుందా? అలా అనుకునేసరికి తలలోని నరాలు ఉబ్బి పగులుతాయా అనిపించేంతగా నొప్పి మొదలైంది. అప్పటికే గొంతు ఎండిపోయింది.

"ఎందుకొచ్చినవయ్యా? మీ మామ లేడయ్యా?" అంటూ రాంరెడ్డి భార్య ఏడ్వసాగింది. తాను వచ్చి వాళ్ళల్లో దుఃఖాన్ని అధికం చేశానా అనిపించింది. తట్టుకోవడం రాకేష్‌కు కష్టంగా ఉంది. కళ్ళు వర్షించడం మొదలుపెట్టాయి. గాలి ఆడడం లేదు. శ్వాస ఆగిపోతుందేమో అని అనిపించింది. అందర్నీ చీల్చుకుని బయటకు వచ్చాడు.

ఈ ఊళ్లు ఇలా చితికిపోవాల్సిందేనా? అనే బాధ అతడ్ని కలచివేయసాగింది. మొదట్లో ఉన్న చిరాకు పోయింది. మిగిలిందొకటే గుండెను పిండేస్తున్న బాధ. రాష్ట్రంలో రైతులు ఒక్కొక్కరే వరుసగా కూలిపోతున్న దృశ్యం. ఊళ్ళు రైతులను కోల్పోతున్నాయి. రైతులు లేని ఊళ్ళు ఉండడం సాధ్యమేనా? రైతులు లేని భారతదేశం ఎలా ఉంటుంది?

జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ తీసి ఒక సిగరెట్ అంటించాడు. గుండె నిండా బాధ పొగ పొగలుగా చేరుతున్న భ్రాంతి. ఒక ముసలాయన వచ్చి పక్కన నిలబడి రాకేష్ వైపు పరీక్షగా చూశాడు.

"ఏంది బాబూ! మా రైతులమంతా చచ్చిపోయినంక ఈ దేశం ఎట్లా ఉంటదంటవు? నోట్లు ముద్రించుకొని వాటిని నమిలి మింగుతరా? ఇదిగో చూడు ఈ రోడ్లు వేసింద్రు. దీన్ని రొట్టె ముక్కల లెక్క కొరుక్కొని తింటామా?"అని అన్నాడు. ఆ మాటలు తనతో అన్నాడో లేక తనకు తానే అనుకున్నాడో అర్థం కాలేదు. జవాబేదీ ఆశించకుండా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఈ ఐదేళ్ళ కాలంలో బహుశా రైతు అనుభవించని బాధ లేదు. పొందని అవమానం లేదు. నాగరికుల అట్టహాసం ముందు వెన్నెముక వంగిపోతున్న రైతు కనిపిస్తున్నా పట్టించుకోకపోవడం ఎంత దాకా దారి తీసింది?!

అంతా సిద్ధమై పాడె లేచింది. పాడె వెనుక రాకేష్. ఊరు ఊరంతా కాష్టానికి కదులుతున్న చిత్రం.